క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం అర్చకులు కరకుదురు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని పెళ్లికొడుకు, పెళ్లి కూతుర్లుగా అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలోని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, లక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈవో రామలింగ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ కనకరాజు

గోకవరం: కొత్తపల్లిలోని ఆదర్శ విద్యాసంస్థల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గత నాలుగు రోజులుగా ఆదర్శ ఫార్మసీ కళాశాల, పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ పి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హారిక ప్రవల్లిక, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

రంగంపేట: మండలవ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మండలంలో మొత్తం 8929 మంది పింఛనుదారులుండగా వారికి ప్రతి నెలా రూ.2,45,45,000 నగదును అందిస్తున్నారు.

ఆకాశాన్ని అంటుతున్న ధరలు

సీతానగరం: నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అన్నారు. ఆదివారం సీతానగరంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆయన నిర్వహించారు. గద్దె సురేష్, వలవల రాజా, కాండ్రు శ్రీను పాల్గొన్నారు.

రామాలయం వద్ద అన్న సమారాధన


రంగంపేట కోదండ రామాలయం వద్ద జరుగుతున్న అన్న సమారాధన

రంగంపేట: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీకోదండ రామాలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అంతకుముందు సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద..

సీతానగరం: స్థానిక పంచాయతీ పరిధిలోగల లంకూరు దక్షిణ రామాలయం వద్ద ఆదివారం అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత నెల 30న శ్రీరామనవమి సందర్భంగా లంకూరు దక్షిణవైపు శ్రీకోదండ రామాలయం వద్ద శ్రీ సీతారాముల కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనకు నాలుగు వేల మంది భక్తులు హాజరయ్యారు. రాత్రి కూడా అన్నసమారాధన నిర్వహించారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం ఖాయం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి లేని అనుమతి


కొంకుదురులో విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి

బిక్కవోలు: పదోతరగతి విద్యార్థులకు నేటి నుంచి పరీక్షా కాలం మొదలవుతోంది. పరీక్షల్లో వచ్చే ప్రశ్నల ఆధారంగా కష్టపడి చదివిన పాఠాలను గుర్తు చేసుకుని జవాబులు రాయాలంటే ముందుగా విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనలను అధిగమించాలి. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి. రానున్న రెండు వారాల పాటు విద్యార్థుల దృష్టంతా చదువుపై పెట్టి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే విజయం ఖాయమని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

ఒత్తిడే సవాల్

పది పరీక్షలు అనగానే విద్యార్థుల్లో తెలియని ఆందోళన, మానసిక ఒత్తిడి ఎదురవడం సర్వసాధారణంగా కనిపించేదే.. విద్యార్థులు రోజూ తెల్లవారు జామున లేచి చదువుకోవడంతో పాటు పాఠశాలల్లో అదనపు తరగతులు ఏర్పాటు చేసి మరీ శిక్షణ ఇచ్చారు. గతంలో హిందీ తప్ప అన్ని సబ్జెక్టులకు రెండేసి పేపర్లు ఉండేవి. ఒక పేపరు సరిగా రాయకపోయినా రెండో పేపరులో మార్కులు స్కోరు చేసేలా ప్రయత్నించేవారు. ప్రస్తుతం ఒక పేపర్ మాత్రమే ఉండటంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షల వేళ ఒత్తిడికి గురవుతున్న విద్యార్థుల్ని గుర్తించి వారిలో ఆత్మవిశ్వాసం నింపాల్సిన అవసరముందని వైద్యులు చెబుతున్నారు. అలాగే విద్యార్థులకు తగినంత నిద్ర, సమతుల ఆహారం ఉండేలా సైతం జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

అనపర్తి నియోజకవర్గంలో 2,973 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నారు. వారిలో అనపర్తి మండలానికి చెందిన 844 మంది, బిక్కవోలు మండలానికి చెందిన 694 మంది, రంగంపేట మండలానికి చెందిన 618 మంది, పెదపూడి మండలానికి చెందిన 817 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ జరుగుతాయి. అయితే ఉదయం 9.30 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని బిక్కవోలు ఎంఈవో శ్రీనివాసరావు స్పష్టం చేస్తున్నారు. అందుకే విద్యార్థులు ఆఖరి నిమిషంలో హైరానా పడకుండా ఉండేందుకు ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

తగినంత నిద్ర, ఆహారం అవసరం



పరీక్షల సమయంలో విద్యార్థులకు సహజంగానే ఒత్తిళ్లు ఏర్పడతాయి. అందుకే తగినంత నిద్ర, సాత్వికమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టినా రోజుకు కనీసం ఏడు గంటల పాటు ప్రశాంతంగా నిద్రపోవాలి. గాఢ నిద్ర వల్ల చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యులు, అనపర్తి

తల్లిదండ్రులే విద్యార్థుల్ని కేంద్రాలకు చేర్చాలి



పరీక్షల సమయంలో విద్యార్థుల ఆలోచనలు, ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు, బంధువులే పరీక్షా కేంద్రాల వద్ద వారిని వదిలిపెట్టడం మంచిది. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి.

– బుజ్జిబాబు, ఎస్ఐ, బిక్కవోలు

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

అనపర్తి: మండలంలో పదోతరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ కె.స్వామినాయక్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు మండలంలో 15 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పరిధిలో మొత్తం 880 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. దీనికి గాను మండలంలోని కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, అనపర్తి జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాల, స్థానిక జీబీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో ఏ విధమైన జిరాక్స్ షాపులను నిర్వహించరాదని ఎంఈఓ సూచించారు.

నేటి నుంచి గృహ సారథులకు సమావేశాలు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో గృహ సారథులతో సోమవారం నుంచి సమావేశాలు నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు రోజుకు నాలుగు గ్రామాల చొప్పున గృహ సారథులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తామని చెప్పారు.

మహిళా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు


శహపురంలో మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందడుగేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. కాండ్రేగుల, శహపురం గ్రామాల్లో వైఎస్సార్ మూడో విడత ఆసరా లబ్ధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఓట్ల కోసం పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్ మహిళలకు ఆసరా పథకం అమలు చేస్తున్నారన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, చందాళ్ల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మాంసం విక్రయాలు అరికట్టాలంటూ ర్యాలీ


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్సై శివనాగబాబు

గోకవరం: కల్తీ మేకమాంసం విక్రయాలను అరికట్టాలని కోరుతూ ఆదివారం సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఎంపీపీ పాఠశాల వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ గోకవరంలో ఇటీవల కల్తీ మేకమాంసం విక్రయాలు పెరిగిపోయాయని ఆరోపించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఎంపీపీ పాఠశాల ప్రహరీని ఆనుకుని మేకమాంసం దుకాణం నిర్వహిస్తున్నారని, వ్యర్థాలను శుభ్రం చేయకపోవడం వలన విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. దీనిపై నాలుగు రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆందోళన కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై యువి శివనాగబాబు అక్కడికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, పెద్దాడ వెంకన్నదొర, అరిసెపు రాంబాబు, తోట సాయిబాబు, మచ్చా మోహన్, బిజ్జి రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వమిది

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం


గడప గడపకూ కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వమిదని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం నాలుగో రోజు అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి, హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజలందరిని కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు.

జనరంజక పాలన అందిస్తున్న సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జనరంజక పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఏ ఒక్కరి సిఫార్సు అవసరం లేకుండా అర్హులందరికీ వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో సగర్వంగా ప్రజల చెంతకు వెళుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తిరగటి శివ, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బాల, పార్టీ నాయకులు నూకల రాము, మెకానిక్ శ్రీను, వార్డు సభ్యులు మల్లిడి కృష్ణారెడ్డి, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు షేక్ ఈసుబు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన యువతీ యువకులు

స్థానిక పాతవూరు కొత్తపేటలో ఆదివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఐదుగురు యువతీ యువకులు రాబోయే ఎన్నికల్లో తమ ఓటు వైఎస్సార్ సీపీకేనని ప్రకటిస్తూ పార్టీలో చేరడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. కొత్తగా ఓటు హక్కు పొందిన అనపర్తికి చెందిన పెనుగొండ మనోజ్, ఇమ్మంది సంజయ్‌కుమార్, పెనుగొండ భరత్‌కుమార్, ఇమ్మంది సౌజన్య, పెనుగొండ సజనిలు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పేపరు మిల్లు ఉద్యోగి మృతితో శ్రీరామపురంలో విషాదం

రాజానగరం: రాజమహేంద్రవరం పేపరు మిల్లు ఉద్యోగి సంగీత సత్యనారాయణ మృతితో ఆయన స్వగ్రామమైన దివాన్‌చెరువు శివారు శ్రీరామపురంలో విషాద వాతావరణం నెలకొంది. పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం మృతదేహాన్ని శ్రీరామపురానికి ఆదివారం తీసుకువచ్చి, తదుపరి రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సత్యనారాయణ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. మిల్లు యాజమాన్యమే దీనికి బాధ్యత వహించాలని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతోపాటు శ్రీరామపురం గ్రామస్తులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


అనపర్తిలో పూలతో అలకరించిన ఈత మట్టలు చేతబట్టి ర్యాలీ చేస్తున్న చిన్నారులు

అనపర్తి: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే మట్టల ఆదివారం పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్నారులు వివిధ రకాల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతపట్టి ప్రభువు కీర్తనలను ఆలపించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ చివరగా క్రీస్తు కృపాలయాలకు చేరుకుని భక్తి ప్రపత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఏసు కృపాలయాలకు చెందిన విశ్వాసులందరూ ఏసు ప్రభువును స్తుతిస్తూ నగర సంకీర్తనను నిర్వహించారు.

గోకవరం: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తంటికొండలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో ర్యాలీ చేశారు. గోకవరంలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్ఎస్ చర్చి, రంపయర్రంపాలెంలోని సెయింట్ పీటర్ లూథరన్ చర్చితో పాటు పలు గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలో ట్రినిటి లూథరన్ చర్చి పాస్టర్ ఏసుపాదం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈత కొమ్మలకు ప్రత్యేక పూలు అలంకరించి రాజకుమారుడు వస్తున్నాడంటూ క్రీస్తు ప్రార్థనల నడుమ ర్యాలీ చేశారు. అనంతరం ఏసు సందేశం వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ కర్రి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: మండలంలోని పలు క్రైస్తవ ఆలయాల్లో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదపూడి బేతేలు చర్చిలో పాస్టర్ చుక్కా శామ్యూల్ రాజు, దేవకుమారి దంపతులు మట్టల ఆదివారం ప్రత్యేకతను క్రైస్తవ భక్తులకు వివరించారు. పాస్టర్ చుక్కా జాన్ రత్నం, క్వయిర్ టీం ప్రతినిధి చుక్కా మేరిషర్మిల ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. క్రైస్తవ చిన్నారులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మండల గ్రామాల్లో ఏసు విశ్వాసులు మట్టలతో ఏసును స్తుతిస్తూ పాటలు పాడుతూ పురవీధిలలో తిరిగారు. సర్వ లోకానికి ఏ భేదం లేకుండా ఏసుక్రీస్తు దీవెనలు, శాంతి అందరికి కలగాలని ఉపవాస ప్రార్థనలు చేశారు.


పశ్చిమగానుగూడెంలో ఆకులు, పూలతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

భక్తి శ్రద్ధలతో మానుకొమ్మల పండగ

మధురపూడి: క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు శ్రమలు అనుభవించిన తపస్సు కాలం సందర్భంగా ఆదివారం కోరుకొండ మండలంలో మానుకొమ్మల పండగ జరిగింది. చర్చిలలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. తొలుత చెట్టు కొమ్మలు, పుష్పాలు, ఆకులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు వాక్య సందేశాన్ని ఇచ్చారు. తపస్సు కాలం మరో వారంలో ముగియ ఉన్నట్లు చెప్పారు. క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేయాలని కోరారు. కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ జోసఫ్ తంబి, పశ్చిమగానుగూడెం లూథరన్ చర్చిలో పాస్టర్ కృపావిల్సన్ మాట్లాడారు. సంఘ పెద్దలు బెల్లపు డేవిడ్, గొల్లపల్లి ప్రవీణ్, ఈతకొట్టు ఎజ్రా పాల్గొన్నారు.

వరి కోతలకు వర్షంతో ఆటంకం


బాలవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

రాజానగరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి పంట సాగుకు కొన్ని ప్రాంతాలలో ఇబ్బంది పెడుతుంటే, మరి కొన్ని ప్రాంతాలలో ఉపయోగపడుతోంది. మెట్ట ప్రాంతమైన రాజానగరం మండలంలో యంత్రాల సాయంతో వరి పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ వర్షాలు ఆయా రైతులకు ఇక్కట్లను తెస్తున్నాయి. కోసిన పంటను త్వరత్వరగా బస్తాలకు చేర్చి, విక్రయించే వరకు అన్నదాతలు ఏ సమయంలో వర్షం కురుస్తుందోనని భయపడిపోతున్నారు. అదే కోరుకొండ, సీతానగరాలలో వరి పంట కోతలకు ఇంకా సమయం ఉండటంతో కాస్త కూస్తో ఈ వర్షం వరి పంటతోపాటు కూరగాయల సాగుకు బాగా ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు.

రెండు మండలాల్లో..

గడచిన 24 గంటలలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 22.2 మి.మి. వర్షం పాతం నమోదైంది. ఇదంతా రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం(9.8 మి.మీ.) కోరుకొండ (12.4 మి.మీ.) మండలాల్లోనే నమోదైంది. మిగిలిన మండలాలో తుంపర్లు తప్ప పెద్దగా వర్షం కురియలేదు.

రంగంపేటలో అకాల వర్షం

రంగంపేట: మండలంలో ఆదివారం అకాల వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో ఉక్కపోతకు గురైన ప్రజలు మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వానలు పామాయిల్, నిమ్మ, జీడి మామిడి, కూరగాయ పంటలకు మేలు చేయగా మామిడి తోటల్ని దెబ్బతీశాయని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా రబీ వరి కోతలు జోరుగా సాగుతున్న తరుణంలో వర్షం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఓ మామిడి చెట్టు నేలకొరిగింది.

సాహిత్యం అభ్యుదయం వైపు నడపాలి

సీటీఆర్ఐ: యువతను అభ్యుదయం వైపు నడింపించడానికి సాహిత్యం ఉపయోగపడాలని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పు గోదావరి జిల్లా శాఖ ప్రథమ మహాసభ ఆదివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగింది. ముందుగా సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళీలర్పించారు. రాష్ట్ర అరసం కార్యవర్గ సభ్యులు, రచయిత చెరుకుమల్లి సింగారావు రచించిన గోదావరి నానీలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కన్వీనర్ పడాల వీరభద్రరావు, బొల్లినేను నాగార్జునసాగర్, కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్


బ్రౌన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గరికపాటి తదితరులు

ప్రకాశం నగర్ : తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ అని పద్మశ్రీ గరికిపాటి నరసింహరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన బ్రౌన్ మందిరాన్ని సందర్శించారు. బ్రౌన్ తైలవర్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. శ్రీ సన్నిధానం సంచికను విడుదల చేశారు. బొల్లాప్రగడ ఉదయభాను రాసిన 'ఉదయ భావనలు' కవితా ఖండికను గరిపాటికి బహూకరించి ఘనంగా సత్కరించారు.

జోరుగా మొక్కజొన్న విరుపు పనులు

మధురపూడి: ఆరుతడి పంటయిన మొక్కజొన్న పొత్తు విరుపు పనులు కోరుకొండ మండలంలో జోరుగా సాగుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరుగుతున్న పనుల్లో వ్యవసాయ కూలీలు పనిచేస్తున్నారు. తుపాను బెడద తప్పడంతో రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో ఐదు వేల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగయింది.

బాపిరాజుకి మరో రికార్డ్

కంబాలచెరువు: వెస్ట్ బెంగాల్ బుక్ ఆఫ్ రికార్డ్ 2023లో తన పేరు నమోదయిందని నగరానికి చెందిన చిత్రకారుడు డాక్టర్ పుప్పాల బాపిరాజు తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రజలకు ఆ వ్యాధిపై అవగాహన కల్పించే నిమిత్తం వేసిన చిత్రాలు ప్రాచుర్యం పొందడంతో ఈ చోటు దక్కిందన్నారు.

కుటుంబ వ్యవస్థలో శ్రీరాముడు అంతర్భాగం

- ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కాసా జయప్రద
- ఘనంగా 'ప్రత్యక్ష ఆలయదర్శిని' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వారణాసి సుబ్రహ్మణ్యం తదితరులు

సీటీఆర్ఐ: భారతీయ కుటుంబ వ్యవస్థలో శ్రీరాముడు అంతర్భాగమని, నరుడిగా జన్మించి ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మాన్ని వీడని ఆదర్శ కథానాయకుడు శ్రీరామచంద్రుడని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కాసా జయప్రద అన్నారు. ఆదివారం స్థానిక దానవాయిపేటలోని ప్రణవకుటి నివాసంలో డాక్టర్ చల్లా సత్యవాణి రచించిన 'ప్రత్యక్ష ఆలయ దర్శిని– శ్రీసీతారామాంజనేయ దేవాలయాలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. డాక్టర్ చల్లా సరస్వతి నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఆమె సోదరి చల్లా సత్యవాణి ఈ కార్యామాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక సమీక్ష నిర్వహించిన జయప్రద మాట్లాడుతూ సత్యవాణి ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమన్నారు. గౌరవ అధ్యక్షుడిగా పాల్గొన్న మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ రామాయణ ఫలశ్రుతిలో ఈ గ్రంథ పారాయణ వల్ల కుటుంబ, ధనధాన్యాభివృద్ధి కలుగుతుందని ఉందన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీ వేత్త వారణాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాలతో పాటు మారుమూల గ్రామాలలో ఉన్న ఆలయాల గురించి కూడా రచయిత్రి వివరించడం అభినందనీయమన్నారు. చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్ సంచాలకత్వం వహించగా రాజమహేంద్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. సహస్ర పున్నముల దర్శనం చేసుకున్న తాడేపల్లి భానుమతిని సత్కరించారు.